ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 28 సెప్టెంబరు 2024

గల్ఫ్ కార్మికులను మోసం చేసిన కేసీఆర్, కేటీఆర్ 8
రైతు రుణమాఫీ సాహసోపేత నిర్ణయం 8

'మీన'మేషాలు



- అదును దాటుతున్న చేపపిల్లల పంపిణీ
- టెండర్ ఖరారైన ముఖం చాటేసిన కాంట్రాక్టర్లు
- బకాయిలు రాక ముందుకు రాని పరిస్థితి
- బదులుగా నగదు బదిలీ చేయాలని సొసైటీల విజ్ఞప్తి
- మత్స్యకారుల్లో ఆందోళన

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అదునుదాటుతున్నా చెరువులకు చేప పిల్లలు చేరడం లేదు. ఏటా మత్స్యకారులకు అందిస్తున్న ఉచిత చేపపిల్లల పంపిణీపై మీన మేషాలు కొనసాగుతున్నాయి. సమృద్ధిగా కురిసిన వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. చేప పిల్లల పంపిణీ మాత్రం మొదలవడం లేదు. ఏటా జూలై నుంచి అక్టోబరులోగా చేప పిల్లల పంపిణీ పూర్తి చేసేవారు. ఈ సారి కొంత ఆలస్యమైనా మానేరు, అన్నపూర్ణ, ఎగువ మానేరు ప్రాజెక్టులతోపాటు చెరువులు, కుంటల్లో నీటి మట్టాలు తగ్గిపోయినా తరువాత కురసిన భారీ వర్షాలు, ఎల్లంపల్లి నీటి ఎత్తిపోతలతో మళ్లీ జలకళ సంతరించుకున్నాయి. చెరువులు, కుంటల్లోకి పూర్తి స్థాయిలో నీళ్లు చేరాయి. చేపపిల్లల పంపిణీకి అనువుగా మారిన సందిగ్ధమే ఏర్పడింది. జిల్లాలో 8 సంవత్సరాలుగా ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి వంద శాతం ఉచితంగా చేపపిల్లల పంపిణీ జరుగుతోంది. 2023-24 సంవత్సరానికి జిల్లాలోని 440 సొసైటీల పరిధిలోని చెరువుల్లో 1.41 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారు. మూడు రిజర్వాయర్‌లలో 44.80 లక్షల రొయ్యల విత్తనాలను వదిలారు. జిల్లాలో యాక్షన్ ప్లాన్ ప్రకారం వర్షాకాలంలో ఏటా 35-40 ఎంఎం సైజు చేప పిల్లలు 68 లక్షలు, 80 - 100 ఎంఎం చేప పిల్లలు 71 లక్షలు వదిలారు. 2024- 25 సంవత్సరానికి జిల్లాలో 1.40 కోట్ల చేపపిల్లలు వదలాలనే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. కానీ ఆలస్యం కావడం, చేపపిల్లలు సమృద్ధిగా లభించకపోవడం, గతంలోని బిల్లులు రాకపోవడం వంటి కారణాలతో కాంట్రాక్టర్‌లు ముందుకు రాని పరిస్థితి. ప్రభుత్వం కూడా ఈసారి లక్ష్యంలో 50 శాతం మాత్రమే పంపిణీ చేయాలని ఆలోచిస్తోంది. దీని ప్రకారం జిల్లాలో 35-40 ఎంఎం సైజు చేపపిల్లలు 34.23 లక్షలు, 80-100 ఎంఎం సైజు 36.35 లక్షలు మాత్రమే వదిలే అవకాశం ఉంది. దీంతో మత్స్యకారులు నష్టపోతున్నారు.

కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేయాలి

జిల్లాలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేపపిల్లల పంపిణీకి అదును దాటిపోతుండడంతో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి సొసైటీలకు బాధ్యత అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాయి. గత ప్రభుత్వం 2018లో కాంట్రాక్ట్ వ్యవస్థ తీసుకొచ్చిందని, గతంలో సొసైటీలకు సంబంధించిన వారే చూసేవారని పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్ల ఆధిపత్యంతో క్షేత్ర స్థాయిలో మత్స్యకారుల ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని వాపోతున్నారు. ఈ సారి కాంట్రాక్ట్ వ్యవస్థ కాకుండా చేపపిల్లల బదులు సొసైటీలకు నగదు బదిలీ చేయాలని కోరుతున్నారు.



మత్స్య శాఖ ఆధ్వర్యంలో జూలైలో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు పాత బిల్లులు రాకపోవడంతో ఆసక్తి చూపలేదు. చివరకు టెండర్ ప్రక్రియలో మూడు ఏజెన్సీలు టెండర్లు వేశాయి. ఇందులో రెండు అర్హత సాధించగా జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి ఆధ్వర్యంలో బృందం చేపపిల్లల నిల్వలపై పరిశీలన చేసింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఉత్పత్తి కేంద్రంలో చేపపిల్లలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఒక టెండర్‌ను తిరస్కరించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో చేపపిల్లలు ఉండడంతో టెండర్లు ఖరారు చేశారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉన్నా ఇప్పటి వరకు ముం దుకు రాలేదు. సెక్యూరిటీ డిపా జిట్ చె ల్లిం చ డా ని కి ముందుకు రాక పోవడంతో కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా జారీ చేశారు. దీంతో చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ముందుకు సాగడం లేదు.

సవ్యంగా సాగినా 50 శాతమే ఎంపిణీ

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు నిచ్చే ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంపై ఈసారి నీలినీడలు కమ్ముకున్నాయి. గతంలో జిల్లాలోని కాళేశ్వరం ఎత్తిపోతలతో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ , అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్ట్ ఎగువ మానేరు ప్రాజెక్ట్‌తో పాటు చెరువులు, కుంటల్లో ముందు టెండల్లోనూ నీళ్లు ఉండడంతో సకాలంలో చేపపిల్లల పంపిణీ జరిగేది. ఈ సారి ఎన్నికల కోడ్‌తో పాటు ప్రభుత్వం మారడంతో ప్రక్రియ ఆలస్యంగా మొదలైంది. జిల్లాలోని వి ం డ

చేపపిల్లలు చెరువుల్లో వదిలిన తీరు

సంవత్సరం	జలవనరులు	వదిలినవి (లక్షల్లో)
2016- 17	92	30.5
2017- 18	66	20
2018- 19	95	57.48
2019- 20	313	100.91
2020- 21	362	115.61
2021- 22	392	119.25
2022 -23	392	138.27
2023 -24	440	141.00
2024- 25	430	140.00

జిల్లాలో మత్స్య సహకార పరిస్థితి

జిల్లాలో మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నిత్యం నీటిపై పోరాటం చేస్తూ ఉపాధిని అందుకుంటున్నారు. జిల్లాలో మత్స్య శాఖ పరిధిలో 440 చెరువులు ఉన్నాయి. 138 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా 8820 మంది సభ్యులు ఉన్నారు. 20 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, రెండు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం వరకు మిడ్ మానేరులో చేపలు పట్టడానికి 618 మంది మత్స్యకారులకు, ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లో 265 మంది, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 226 మంది మత్స్యకారులకు లైసెన్స్‌లు జారీ చేశారు. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద జిల్లాలో 75 శాతం సబ్సిడీతో 1094 మందికి చేపలు అమ్ముకోవడానికి వాహనాలను అందించారు. ఈ సారి చేపపిల్లల పంపిణీలో జాప్యంతో ఆందోళన చెందుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో రాజన్న ఆలయాభివృద్ధి

- దేవస్థానం పరిసరాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన



గుడి చెరువు ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 27 : కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో భాగంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి చేపట్టనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే వంద పడకల ధర్మశాలలు, అన్న ప్రసాద భవనం, క్యూ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ ఆర్కిటెక్ట్ కిషోర్, ప్లానర్ మౌనిక శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు పనులకు సంబంధించిన నివేదిక అందజేసినట్లు వారు తెలిపారు. ఉన్నత కార్యాలయ పర్యవేక్షక ఇంజనీర్ దుర్గ ప్రసాద్, స్థపతి వల్లి నాయగం, ఈవో వినోద్‌రెడ్డి, కార్యనిర్వహక ఇంజనీర్ రాజేష్, రఘునందన్, మహిపాల్ రెడ్డి, రాంకిషన్‌రావు తదితరులు ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న కమలానంద భారతిస్వామి



ఆలయంలో కమలానంద భారతిస్వామి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 27: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని భువనేశ్వరి పీఠం కమలానంద భారతి స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అంతకుముందు ఆయనకు ఆలయ పండితులు స్వాగతం పలికారు. ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పీఆర్వో అశోక్, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరసింహ చారి, శివ ఉన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 27: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నాలుగు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏర్పాట్లు చేసింది. రాజీకి అవకాశం ఉన్న 2781 కేసుల్లో 625 కేసులను పరిష్కరించేందుకు గుర్తించారు. ఇందులో జిల్లాలోని 13పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దాదాపు 560 కేసులు లక్ష్యంగా పెట్టారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎన్.ప్రేమలత, కార్యదర్శి రాధిక జైస్వాల్, న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించి లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించారు.

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 27 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో అక్టోబరు 3 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారు తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకోనున్నట్లు, నిత్యం పలు అలంకారాల్లో దర్శనమివ్వనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు స్పందన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 27 : జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ బాలబాలికల ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్ పోటీలకు స్పందన లభించింది. జిల్లా పరిధిలోని వివిధ మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో బాలబాలికలు పోటీలలో సత్తాచాటారు. ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న అదనపు డీజీపీ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 27 : పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లో 17వ పోలీస్ బెటాలియన్‌లో నిర్మిస్తున్న బెల్ ఆఫ్ ఆర్మ్స్, కమాండ్ కంట్రోల్ భవనాలను శుక్రవారం పరిశీలించారు. నూతనంగా నిర్మించబోయే దోబీ, బార్బర్ గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు నిర్మించిన ఫ్యాబ్రికేటెడ్ బ్యారెక్స్‌లతోపాటు గార్డుల గదులు, బెటాలియన్ వెల్ఫేర్ కాంప్లెక్స్, ఆర్వీలను ప్రారం భించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లా డారు. బెటాలియన్ అభివృద్ధిలో అధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయన్నారు. అంతకుముందు సిరిసిల్ల పంచాయతీరాజ్ అతిథిగృహంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, ఉదయభాస్కర్, రామదాసు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

దండం పెడతాం.. కాపాడండి

- విప్ ఆది శ్రీనివాస్‌కు ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇళ్ల యజమానుల విజ్ఞప్తి



వేడుకుంటున్న ఇళ్ల యజమానులు

వేములవాడ, సెప్టెంబరు 27 : ఎఫ్‌టీఎల్ పేరిట చేపట్టిన సర్వేతో తాము తీవ్ర ఆందోళన లోనవుతున్నామని, ఎన్నో ఏళ్ల కింద కట్టుకొని ఉంటున్న నివాసాల జోలికి అధికారులు రాకుండా చూడాలని వేములవాడ గుడి చెరువు సమీపంలోని ఇళ్ల యజమానులు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. వేములవాడ గుడి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నివాసాలను గుర్తించేందుకు అధికారులు ఇటీవల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో తమ ఇళ్లను కూడా కూల్చివేసే ప్రమాదం ఉందని యజమానులు కొద్దిరోజులుగా ఆందోళనకు గురవుతున్నారు. దీంతో తమ ఇళ్ల జోలికి రావద్దని కోరుతూ శుక్రవారం వేములవాడలో ఆది శ్రీనివాస్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. తాము కొన్ని సంవత్సరాల క్రితమే అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టి జీవనం సాగిస్తున్నామన్నారు. అధికారుల సర్వేతో తాము ఆందోళన చెందుతున్నామని, నివాసాలను, మమ్మల్ని కాపాడాలని విప్‌కు దండం పెట్టి వేడుకున్నారు. ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసే బాధ్యత తనదేనని ఆది శ్రీనివాస్ వారికి హామీ ఇచ్చారు.

ప్రజా ఉద్యమాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అంకితం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రభుత్వ విప్, మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ కన్వీనర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంతోపాటు, తెలంగాణలో నైజాంకు వ్యతిరేకంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాడారని, తొలి, మలి దశ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పని చేశారని అన్నారు. రాబోయే తరాలకు ఇబ్బందులు కలిగినపుడు ప్రశ్నించే గొంతులుగా మారాలని ఉద్య మకారుల ప్రతిమలు స్ఫూర్తిని స్తాయన్నారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయ సాధనకు పాటు పడాలన్నారు. సహకార సంఘాల గురించి ఆలోచించారని, చేనేత వస్త్రాలను ప్రచారం చేశారని అన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని వదిలిన గొప్ప వ్యక్తి అన్నారు. రాజకీయాలకు అతీతంగా వేడుకలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో నేతన్నలకు అండగా ఉంటుందన్నారు. సిరిసిల్లలో మార్కండేయ దేవాలయ పునర్నిర్మాణానికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జిందం చక్రపాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పద్మశాలి సంఘం ప్రతినిధి బొల్లి రామ్మోహన్, పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోనె ఎల్లప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ ఛైర్మన్ మురళి, ఏఐసీసీ సభ్యుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ స్వరూపరెడ్డి, వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్, పద్మశాలి కల్యాణభవనం అధ్యక్షుడు శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాస్కర్, పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు వనిత, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ శంకరయ్య, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు నర్సయ్య, అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు దేవదాస్, మాల మహానాడు అధ్యక్షుడు రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు, యాదవ సంఘం నాయకుడు మల్లేశం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆడెపు చంద్రకళ, గుజ్జె తార, మ్యాన రవి, లక్ష్మీనారాయణ, సత్తార్, మనోజ్, చందర్, మండల సత్యం, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్ : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


పునరావాస కాలనీలో సమస్యలను పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, సెప్టెంబరు 27: అనంతగిరి పునరావాస కాలనీలో సమస్యలు పరిష్కరిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. గ్రామ సందర్శనలో భాగంగా శుక్రవారం అనంతగిరి, సిరికొండలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతగిరి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమస్యలు ఉన్నాయని, ముత్యాల పోచమ్మ ఆలయం వరకు డబుల్‌రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతగిరి రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని, ఈకో టూరిజం క్రింద అభివృద్ధి చేయడానికి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఎమ్మెల్యే సూచించారు. సిరికొండ గ్రామాన్ని సందర్శించి రంగనాయకసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో నష్టపోతున్న పట్టా భూములు, ఎస్సీ కాలనీలో ఇళ్లులేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ఏఎంపీవో శ్రీనివాస్, ఏఈ అజారుద్దీన్, మాజీ సర్పంచ్ నీలం అంజయ్య, నాయకులు వినయ్‌కుమార్, పసుల వెంకటి, సృజన్‌రెడ్డి, రజనీకాంత్, అంతగిరి, గోపాల్, నవీన్, మంద బాల్‌రెడ్డిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం, ఇందిరమ్మ కాలనీలను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో మిగిలిన హాస్టల్ గదులను పూర్తిచేయడానికి కలెక్టర్ నిధుల ద్వారా మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ ప్రసాద్, కూనబోయిన బాలరాజు, బాలపోచయ్య, గొడుగు నర్సయ్య జమాల్ పాల్గొన్నారు.





చేనేత కార్మికులకు చేయూత

హుజూరాబాద్, సెప్టెంబరు 27: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత నందించేందుకు సిద్ధంగా ఉందని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు కె విద్యాసాగర్ అన్నారు. హుజూరాబాద్ చేనేత సంఘం 71వ వార్షిక, 82వ మహాసభ శుక్రవారం నిర్వహించారు. చేనేత కార్మికులు ప్రస్తుత అభిరుచికి తగిన విధంగా వస్త్రాలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జనార్దన్, సంతోష్‌కుమార్, అజారి వహబ్, శ్యాంసుందర్‌రెడ్డి, జీవన్ కుమార్, రాజయ్య, ఎలిగేటి ఉపేందర్, యాదగిరి, మహాదేవ్, వెంకటయ్య, సత్యనారాయణ, ప్రభాకర్, సుమలత పాల్గొన్నారు.





సిర్సపల్లిలో తెలంగాణ వైద్య మండలి తనిఖీలు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 27 : హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లి గ్రామంలో తెలంగాణ వైద్య మండలి పరిషత్ మెంబర్, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ నరేష్ కుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని సిర్సపల్లిలో నకిలీ ఆర్‌ఎంపీ డాక్టర్ యాంటీబయోటిక్స్, స్టిరాయిడ్స్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఆర్‌ఎంపీపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య మండలి చైర్మన్‌కు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన ఆర్‌ఎంపీ వైద్యుడు విచారణలో నిజాలు వెల్లడైనందున చట్ట ప్రకారం కేసు నమోదుకు సిఫారసు చేశామన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు. హెచ్‌ఆర్‌డీఏ ప్రెసిడెంట్ వెంకటస్వామి, హెచ్‌ఆర్‌డీఏ సెక్రటరీ డాక్టర్ గౌతమ్ ఉన్నారు.

బదిలీల మార్గదర్శకాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 27: టీజీఎన్‌పీడీసీఎల్‌లో బదిలీల మార్గదర్శకాలను ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుత ఉద్యోగంలో జూలై 30, 2024 నాటికి రెండేళ్లు పూర్తిచేసుకున్న 50 శాతం ఉద్యోగులను బదిలీచేయడానికి ఉత్తర్వులను విడుదల చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందిలో జూనియర్ లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ వరకు డివిజనల్ అధికారి ఉన్న సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు బదిలీ చేయనున్నారు. సబ్ ఇంజనీర్లు, అకౌంట్స్ సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందిలో జూనియర్ అకౌంట్స్ అధికారి నుంచి ఫోర్‌మెన్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, సాధారణ ఉద్యోగులను ఎస్‌ఈ బదిలీ చేయనున్నారు. ఆపై స్థాయి ఉద్యోగులు, ఇంజనీర్లను సీఎండీ బదిలీ చేయనున్నారు. సబ్ ఇంజనీర్ ఆపై స్థాయి బదిలీకి అర్హత కలిగిన ఉద్యోగులు, ఇంజనీర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా ఆయా సంఘాల నాయకులకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఉద్యోగులైన దంపతులతో పాటు 30, సెప్టెంబరు 2025 లోపు పదవీ విరమణ చేసేవారికి, వితంతువు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈనెల 28లోగా బదిలీకి అర్హులైన వారి జాబితాను రూపొందించాల్సి ఉంటుంది. 30న జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబరు 4న సాయంత్రం ఐదు గంటలలోగా ప్రాపర్ చానల్లో దరఖాస్తుల స్వీకరణ నిలిపివేస్తారు. అక్టోబరు 7న బదిలీల ఉత్తర్వు లు జారీ చేస్తారు. 9వ తేదీన ఉద్యోగి రిలీవ్ కావాల్సి ఉంటుంది. 8 నుంచి బదిలీలపై నిషేధం ప్రారంభమవుతుంది

బావిలో పడి వివాహిత మృతి

మానకొండూర్, సెప్టెంబరు 27: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన మడ్డి అనిత (38) అనే వివాహిత వ్యవసాయబావిలో పడి మృతి చెందిందని సీఐ కర్రె స్వామి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడ్డి అనిత-మడ్డి సమ్మయ్య దంపతులు శుక్రవారం తమ వ్యవసాయ పొలం వద్దకు పశువులకు గడ్డి కోయడానికి వెళ్లారు. అనిత బావి ఒడ్డు నుంచి నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బావిలో నుంచి మృతదేహన్ని బయటికి తీశారు. అనిత తల్లి భూదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పాత కక్షలతో దాడి
ఒకరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, సెప్టెంబరు 27: మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద పాత కక్షలతో శుక్రవారం పలువురు దాడి చేసిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్‌ఎండీ ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్ మండలం, పెద్దతుండ్ల గ్రామానికి చెందిన కందుగుల శ్రీనివాస్ అనే వ్యక్తి తన స్నేహితుడు మధుతో కలిసి ద్విచక్రవాహనంపై రామంచ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. రామంచ గ్రామానికి చెందిన వనాల శ్రీనివాస్, గొట్టిపర్తి రవిగౌడ్, మెరుగు రమేశ్‌గౌడ్, అంబిగాల శ్రీనివాస్ మరి కొందరితో కలిసి బైక్‌ను అడ్డగించారు. రాళ్లు, కర్రలతో దాడి చేశాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మధు అక్కడి నుంచి పారిపోయాడు. శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 27: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,400 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 36మంది 186క్వింటాళ్ల విడి పత్తి, 30మంది రైతులు 44క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,400, కనిష్ఠ ధర 4వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

శిక్షణ తరగతులకు తరలిరావాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 27: సర్వీసు నిబంధనలు, లీవ్ రూల్స్ తదితర అంశాలపై ఆదివారం ఉదయం 9గంటలకు ఎస్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి సానా కిషన్ ఒక ప్రకటనలో కోరారు. కరీంనగర్‌లోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించే శిక్షణ తరగతులకు రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.సదానందగౌడ్, సీనియర్ నాయకుడు గణేశ్ హాజరై అవగాహన కల్పిస్తారని అన్నారు. సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 27: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ దూర విద్యలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదేలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇల్లందకుంట, సెప్టెంబరు 27: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి కోరె రాములు అన్నారు. మండలంలోని సిరిసేడు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలను మండల విద్యాధికారి శుక్రవారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాలలోని 17 ఏళ్ల లోపు బాలబాలికలు 32 జట్లు పాల్గొన్నాయి. ఎంఈవో రాములు మాట్లాడుతూ.. ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. బాలుర విభాగంలో మొదటి బహుమతి చొప్పదండి, ద్వితీయ బహుమతి కరీంనగర్ జట్లు గెలుపొందాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతి కొత్తపల్లి, ద్వితీయ బహుమతి చొప్పదండి జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వేణు, గోపాల్, రమ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కేసులను ఎత్తి వేయించాలి

చిగురుమామిడి, సెప్టెంబరు 27: హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ నవాబుపేట గ్రామ ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయించాలని యువకులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. 2018 అక్టోబరులో ప్రసుత్త మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తమ గ్రామానికి వచ్చిన సందర్భంగా సమస్యలపై నిలదీస్తే అక్రమంగా కేసులు పెట్టారని చెప్పారు. దీంతో కోర్టు చుట్టూ తిరుగలేక ఇబ్బందులు పడుతున్నామని, కేసులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బుర్ర శ్రీనివాస్, బోయిని వంశీకృష్ణ, దోమ శ్రీనివాస్, బుర్ర అశోక్, చెప్యాల వేణు, ఠాగూరు నరేందర్‌సింగ్, కొక్కిస సతీష్, గూళ్ల రాజు, పోలవేణి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు..
ప్రయాణికులు సురక్షితం

తిమ్మాపూర్, సెప్టెంబరు 27: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసి బస్సు టైరు ఒక్కసారిగా పేలింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. హుస్నాబాద్ డిపోకి చెందిన పల్లె వెలుగు ఆర్టీసి బస్సు ప్రయాణీకులతో కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు బయలుదేరింది. మండలంలోని నుస్తులాపూర్- కొత్తపల్లి గ్రామాల మధ్యలో రాజీవ్ రహదారిపై బస్సు వెనక టైరు ఒక్క సారిగా పేలింది. డ్రైవర్ వెంటనే బస్సు నిలిపివేయడంతో ఎవరికి గాయాలు కాలేదు. బస్సులో సుమారు వంద మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.



సహకార సంఘాన్ని సందర్శించిన తమిళనాడు బృందం

పంట రుణాలపై ఆరా

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన తమిళనాడు బృందం

చొప్పదండి, సెప్టెంబరు 27 : చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని తమిళనాడు డీసీసీసీ బ్యాంకు బృందం శుక్రవారం సందర్శించి రైతులకు ఇస్తున్న పంట రుణాలను అడిగి తెలుసుకున్నది. సంఘం అభివృద్ధి, రైతుల ప్రయోజనంకోసం తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పంట పెట్టుబడి కింద ఎకరానికి ఇరవై వేల రూపాయల రుణాన్ని అందిస్తున్నట్లు అధికారులు చెప్పారు. రైతుల కోసం ఎరువులు, విత్తనాలు, పురుగుల నివారణ మందులను తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు బృందానికి వివరించారు. బృందం లో టెస్కాబ్ సీటీవి విజయ్ శంకర్, మంగళూరు బర్డ్ డీజీఎం స్వాతి, పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి, సీఈవో కళ్లెం తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడు ముద్దం మహేష్‌గౌడ్, డైరెక్టర్లు గుర్రం ఆనందరెడ్డి, లంబు రాజిరెడ్డి, సిబ్బందితో పాటు తమిళనాడుకు చెందిన 40 మంది ప్యాక్స్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి



తెలంగాణ చౌక్‌లో భిక్షాటన చేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 27 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆర్ట్స్ కళాశాల నుంచి తెలంగాణ చౌక్ వరకు భిక్షాటన చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో అనేకమంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయకపోతే ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, సంద గణేష్, నగర నాయకులు అభిలాష్, శ్రీకాంత్, ఉమామహేశ్వర్, కార్తీక్, రంజిత్, సంపత్ కుమార్, శికాంత మహమ్మద్ లతోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్సీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 27: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టు 2024 లో నిర్వహించిన ఎమ్మెస్సీ (మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్ డేటా సైన్స్ మ్యాథమెటిక్స్) రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్ వి శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు జూడో ఓవరాల్ చాంపియన్‌షిప్



రాష్ట్ర జూడో పోటీల్లో చాంపియన్లుగా నిలిచిన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్ సెప్టెంబరు 27: తెలంగాణ పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్రస్థాయి జూడో పోటీల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. హన్మకొండలో ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి ఆరు బంగారు, రెండు రజిత, రెండు కాంస్య పతకాలతో చాంపియన్లుగా నిలిచారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు 30 కిలోల విభాగంలో ఆర్ కార్తిక్ బంగారు, 35 కిలోల విభాగంలో టి హర్షిత్‌రెడ్డి బంగారు, 45 కిలోల విభాగంలో యు శివసాయి బంగారు, 40కిలోల విభాగంలో బీ యశ్వంత్ బంగారు, 44 కిలోల విభాగంలో బి వర్షిత బంగారు, ఎ సుష్మిత బంగారు పతకాలును సాధించారు. అలాగే 50కిలోల విభాగంలో బి గణేశ్ రజతం, 50కిల్లో పై విభాగంలో రియాన్ కాంస్య, 23 కిలలో విభాగంలో ఎం లహరి రజత, 32 కిలోల విభాగంలో జె షణ్ముఖశ్రీ కాంస్య పతకాలను సాధించి చాంపియన్లుగా నిలిచారని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా చాంపియన్లుగా నిలిచిన జిల్లా జట్లను డీఈవో జనర్దాన్‌రావు, డీవైఎస్‌వో వి శ్రీనివాస్, జిల్లా జూడో సంఘం అధ్యక్షకార్యదర్శులు కె అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎల్‌వి రమణ, శ్యాం, శ్రీధర్ అభినందించారు.

భిన్న వాతావరణం.. సాగు ప్రశ్నార్థకం,

● అధిక వర్షాలపై రైతుల ఆందోళన

● యాజమాన్య చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబర్ 27: జిల్లాలో ఉన్న భిన్న వాతావరణ పరిస్థితులు పంటల ఎదుగుదల, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడనుంది. అధిక వర్షాలు కొన్ని రోజులైతే.. ఎక్కువ ఉష్ణోగ్రతలు మరికొన్ని రోజులు ఇలా విభిన్నమైన మార్పులు వెంటవెంటనే చోటు చేసుకోవడం సాగును ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఈ మార్పులు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట ఎదుగుదల, దిగుబడులపై కనబడని ప్రభావం పడటం వల్ల అధిక నష్టాలను చవిచూసే పరిస్థితి ఉంది వీటిని ఎదుర్కొని సాగును ముందుకు నడిపించాలంటే వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు అత్యవసరం.



కాట్రపల్లి గ్రామంలోని పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

● వాతావరణ మార్పులతో పంటలపై ప్రభావం

వాతావరణ మార్పులు వరి, పత్తి, కూరగాయల సాగుపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. పంటల ఎదుగుదల, దిగుబడులతో పాటు కొత్తరకమైన తెగుళ్లతో కర్షకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షంతో మొత్తబడిన నేలలు అధిక ఉష్ణోగ్రతల వల్ల గట్టి పడటంతో వేరు వ్యవస్థ దెబ్బతిని ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. పంటలు నీటిని తీసుకునే పరిస్థితులు భిన్నంగా మారడంతో దిగుబడుల తగ్గడానికి కారణమవుతుంది. అధిక వేడి, ఉబ్బ వాతావరణం వల్ల చీడపీడల ఉధృతి పెరిగి కర్షకులపై రసాయన మందుల ఖర్చు అధికంగా పడనుంది. చెరువులు, బావుల కింద వేసిన వరి చిరుపొట్ట దశలో ఉండగా, పత్తి కాయలు పడే దశలో ఉంది. ఇప్పటికే వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులు అధిక పెట్టుబడులు పెట్టడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల ఎకరానికి సాధారణ పెట్టుబడుల కంటే రూ. 5 వేలు అధిక భారం పడనుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు నేలకు తాకొద్దు

కూరగాయల తోటల్లో దుంపలకు నీటి నిల్వ వల్ల పోషకాలు తగ్గుతాయి. వెంటనే లోతైన కాల్వలు ఏర్పాటు చేసి వర్షం నీరు తొలగించి 19:19:19 లేదా 14:35:14 వంటివి పైపాటు పోషకాలు నేరుగా పిచికారి ద్వారా అందించాలి. కాయల సంఖ్య ఎక్కువగా ఉం డి నేలకు తాకి నీళ్లలో ఉంటే తగిన జాగ్రత్త లు పాటించాలి.

వరిలో సస్యరక్షణ చర్యలు

ముందుగా వేసిన వరి చిరుపొట్ట దశలో ఉండగా ఆలస్యంగా వేసిన మరికొన్ని పొలాలు పిలక దశకు చేరాయి. వర్షాలకు నత్రజని ఎక్కువగా మొక్కకు అందుతుంది. రైతులు రెండోసారి యూరియాను పూర్తిగా తగ్గించాలి. మొక్క ఎదుగుదల, పచ్చదనం బట్టి అసలు వేయకపోవడమే మంచిది. ఎదుకంటే అగ్గి తెగులు ఆశిస్తే నష్టం ఎక్కువగా ఉంటుంది. అఖరి దఫాగా 10-15 కిలోల పోటాష్‌తో పాటు 15-20 కిలోల యూరియా కలిపివేస్తే సరిపోతుంది. కాపర్ శిలీంద్ర నాశనులను ఇప్పుడు పిచికారి చేయవద్దు. అధిక వర్షానికి ఉక్కపోత వాతావరణం ఉంటే గాలిలో అధిక తేమ ఉండి సుడిదోమ ఆశిస్తుంది. వర్షాలకు వరి పసుపు రంగుకు మారడం, కొనల చివరి ఎండిపోయి నట్లుగా తెల్లగా ఉంటుంది. వానలు తగ్గిన తర్వాత పైపాటుగా ఎరువులు వేయాలి.

● పత్తిలో నీరు ఉండొద్దు

పత్తి పంటలో అధిక వర్షాలకు నీరు నిల్వ ఉంటే కాల్వలు తీసి మురుగు లేకుండా తొలగించాలి. ఈ వర్షానికి ఎండుతెగులు వస్తుంది. నివారణకు కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ల వద్ద పంపు నాజిల్ తీసి ద్రావణం పోయాలి. వర్షం తగ్గిన వెంటనే 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలి.

పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది



నాకున్న వ్యవసాయ పొలంలో వరి పంట సాగు చేస్తున్నా. ఒకరోజు వర్షం, ఒకరోజు ఎండ వేడితో పంటలలో వివిధ రకాలతెగుళ్ల పెరిగిపోతున్నాయి. వాటిని నివారించేందుకు యూరియా వాడకం పెరగటం ద్వారా పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. పంట చేతి కందేలోపు ఇంక ఎంత ఖర్చు పెరుగు తుందో తెలియటం లేదు.

-బోయిని సమ్మక్క, మహిళ రైతు, కనుకులగిద్దె

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులు మారుతున్న వాతావరణ మార్పు లను దృష్టిలో ఉంచుకుని పంటలను ఆశించే చీడపీడలను ఎప్పటికప్పుడు గమనించాలి. దాని కి అనుగుణంగా వ్యవసాయాధికారుల సూచ నలతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అధిక ఉష్ణోగ్రత, ఉబ్బ వాతావరణంతో వివిధ తెగుళ్లతో వరి, పత్తిపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

-చాడ భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, హుజూరాబాద్

కొనసాగుతున్న ఎస్సారెస్పీ నీటి విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరిలోకి శుక్రవారం వరద నీరు విడుదల కావడం కొనసాగింది. ప్రాజెక్టుకు చెందిన మూడు వరద గేట్లను ఎత్తి దిగువన గల గోదావరిలోకి 9,372 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 52,982 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 37,362 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చిల్లపల్లిని సందర్శించిన పీఆర్ జేసీ

మంథనిరూరల్, సెప్టెంబర్ 27: మండలంలోని చిల్లపల్లి గ్రామాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. అధికారులు, మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్రెండ్లీ ఉమన్ పంచాయతీ అవా ర్డుల ఎంపిక కోసం ఈ గ్రామాన్ని గతంలో అధి కారు లు ప్రతిపాదించగా ఇందులో భాగంగా పీఆర్‌జేసీ సందర్శించినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా మహిళా సంఘాలతో ఆయన ప్రత్యేకంగా మాట్లా డారు. సంఘాల ద్వారా మహిళలు సాధించిన విజ యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, ఎంపీడీవో పూర్ణచందర్, కార్యదర్శిరాం కిషోర్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా వెలిచాల

● అధ్యక్ష, కార్యదర్శులుగా అమిత్‌రావు, మల్లేష్



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27: కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా వెలిచాల రాజేందర్‌రావు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ చెన్నాడి అమిత్‌రావు, బి మల్లేష్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ప్రవేటు హోటల్‌లో నిర్వహించిన కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా సభ్యుల మద్దతుతో నిర్వహించిన ఈ ఎన్నికల్లో ప్యాట్రన్‌గా డాక్టర్ ఈ ప్రసాద్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ సంపత్‌రావు, వైస్ చైర్మన్‌గా పి అనూకర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా మల్లేష్ గౌడ్, మల్లేష్, సునీల్ రెడ్డి, నిర్వహణ కార్యదర్శిగా సుధాకర్, టెక్నికల్ చైర్మన్‌గా ఎన్ లక్ష్మీనారాయణ, రెఫరీ బోర్డు చైర్మన్‌గా డి వీరన్న, సంయుక్త కార్యదర్శిగా ఏ పద్మ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఈ రాంచందర్, జిల్లా క్రీడా శాఖ యోగ కోచ్ ఈ కిష్టయ్య, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి సిద్దారెడ్డి, చొప్పదండి పిడి కె కృష్ణలు పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్నికైన కార్యవర్గాన్ని డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, పలు క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి బర్లకాపరి మృతి

బుగ్గారం సెప్టెంబరు 27 : మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో శుక్రవారం చెరువులో మునిగి బర్ల కాపరి మృతి చెందాడు. స్థానిక ఎస్సై శ్రీధర్ రేడ్డి,కుటుంబ సభ్యుల వివరాల మేరకు సుంకే పేద్ద గంగయ్య (55) అనే వ్యక్తి చిన్నాపూర్ గ్రామస్థుల బర్రెలకు కాపరిగా పని చేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం గెదేలను మేతకు తీసుకెళ్లాడు. ఉదయం చెరువులోకి వెళ్లిన గేదెలను ఒడ్డుకు చేర్చే క్రమంలో గంగయ్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరి రాడక చనిపోయాడు. గంగయ్య భార్య సుంకే లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..

కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 27: కరీంనగర్ శివారులోని రేకుర్తి కల్వర్టువద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంనగర్‌కు చెందిన సుధగుని శ్రీకర్ గౌడ్ (27) మృతి చెందాడని కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. శ్రీకర్ గౌడ్ రేకుర్తి నుంచి రాంనగర్‌లోని తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా రోడ్డుపై బైకు అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి సుదగోని శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి, సెప్టెంబరు 27: బోయినపల్లి మండలం వరదవెల్లి స్టేజీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మండలంలోని వరదవెల్లి చెందిన అంజయ్య తన ద్విచక్ర వాహనంపై కొదురుపాకకు వెళ్తున్నాడు. గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన రాయమల్లు (50), దేవయ్య, ఒద్యారం గ్రామానికి చెందిన ఎల్లయ్య ముగ్గురు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై బోయినపల్లి వైపు నుంచి ఒద్యారం వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు అంజయ్య వాహనాన్ని వెనుక వైపు నుంచి అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాయమల్లు, దేవయ్య, ఎల్లయ్యకు గాయాలవగా ఆస్పత్రికి తర లించారు. రాయమల్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

బోయినపల్లి, సెప్టెంబరు 27: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ వివరల ప్రకారం.. మండలంలోని విలాసాగర్‌కు చెందిన పందుగ ఎల్లయ్య (58) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 18న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. భార్య లక్ష్మి గమనించడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

మల్యాల, సెప్టెంబరు 27: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లికి చెందిన కడారి నీలమ్మ(71) గురువారం రాత్రి ఇంటి వరండాలో పడుకుంది. కుటుంబసభ్యులకు శుక్రవారం వేకువజామున కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. వ్యవసాయ బావిలో మృతిచెంది ఉండటాన్ని గుర్తించారు. నీలమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోందని, దీంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కొడుకు దిలీప్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 27: ఆర్థిక ఇబ్బందులతో దుబాయ్‌లో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న వలస జీవి మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకొచ్చారు. ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగువానిపల్లెకు చెందిన బోయిని గణేష్ (34) అనే వలసజీవి ఉపాధికోసం ఆరేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. స్వగ్రామంలో ఇంటిని నిర్మించడంతో దాదాపు రూ20లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో మానసిక ఆందోళన చెందిన గణేష్ గత నెల 11న దుబాయిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గల్ఫ్‌కార్మికుల రక్షణసమితి అధ్యక్షుడు గుండెల్లి నర్సింహులు, శేఖర్‌గౌడ్, ఆకునూరి మహేందర్ సహకారంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. గణేష్‌కు భార్య రేణుక, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: పల్లెల్లో సారా తయారీ, అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గంభీరావుపేట మండలం నాగంపేటతండా శివారులో సారా తయారీకి వినియోగించే ముడి పదార్థాలు, సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకోగా శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన అజ్మీర నాజం కారులో సారా ముడి సరుకులను రవాణా చేస్తున్నారనే సమాచారంతో వాహన తనిఖీలు నిర్వహించారు. నాగంపేటతండా శివారులో కారును ఆపి సోదాలు చేయగా అందులో 50 కిలోల బెల్లం, 10 కిలోల పటిక, ఐదు లీటర్ల సారా ప్యాకెట్లు లభించాయి. కారుతో పాటు ముడి పదార్థాలు, సారా ప్యాకెట్లను స్వాధీనపర్చుకుని రవాణాదారుడు నాజంపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ వివరించారు.

నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట, రాగట్లపల్లి గ్రామాల్లోని అనుదీప్, లక్ష్మణ్ ద్విచక్రవాహనంపై వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వస్తున్నారు. వెంకటాపూర్ గ్రామంలోని అంజయ్య, శ్రీనివాస్ బైక్‌పై హరిదాస్‌నగర్ శివారులోకి వెళ్లి కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై నుంచి స్వగ్రామానికి తిరిగుతున్న క్రమంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు గాయపడగా సిరిసిల్లలోని ఆసుపత్రికి తరలించారు.

వివాదాలకు కేరాఫ్ రాయికల్ పోలీస్‌స్టేషన్

● ఎస్సైల పనితీరుపై విమర్శలు

● మూడు నెలల వ్యవధిలో ఇద్దరు ఎస్సైలపై వేటు



రాయికల్ పోలీస్‌స్టేషన్

రాయికల్, సెప్టెంబరు 27 : రాయికల్ పోలీస్‌స్టేషన్ వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఎస్సైల తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు నెలల వ్యవధిలో ఇద్దరు ఎస్సైలపై వేటు పడటంతో ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలుగా విధులు నిర్వహించిన ఇద్దరు ఎస్సైలపై వేటు పడటంతో ఈ స్టేషన్ ఎస్సైగా రావడానికి పలువురు విముఖత చూపుతున్నారు. అటవీ ప్రాంతం కావడంతో గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా రాయికల్ మండలం పేరు తెచ్చుకుంది. అటు ఎన్‌కౌంటర్లు, ఇటు నక్సల్స్ దాడులతో రాయికల్ మండలం అట్టుడికినట్లు ఉండేది. ఇసుక, కలప, గుడుంబా, గంజాయివంటి వాటి అక్రమ రవాణా, భూతగాదాలు, వివిధ రకాల పంచాయతీలు వంటి వాటి పరిష్కా రాలతో రాయికల్ పోలీస్ సిబ్బందికి చేతినిండా పని ఉండేది. దీంతో రాయికల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమకు అనుకూలంగా నియమ నిబంధనలు రూపొందించుకుని వాటిని పాటించేవారని పలు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా రా యికల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అశోక్ క్రమశిక్షణ చర్యలు ఉల్లంఘించడంతో ఉ న్నతాధికారులు మందలించారని తెలిసింది. అతనికంటే ముందు ఎస్సైగా విధులు నిర్వ హించిన అజయ్ ఏసీబీ వలలో పడటంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ స్టేషన్‌లో పని చేసిన పలువురు పోలీసులు గతంలో సస్పెండ్ కావడంతో రాయికల్ పోలీస్‌స్టేషన్ లో ఉద్యోగం అంటేనే పోలీసులు హడలిపోతున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సైలు తరచూ ఏదో ఒక వివాదంలో ఇరుక్కోవడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి.

డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై డీసీఎం వ్యాన్ వెనుక టైర్ శుక్రవారం ఒక్కసారిగా పగిలిపోవడం తో దూసుకుపోయి డివైడర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కామారెడ్డి నుంచి జగిత్యాల వైపునకు నూనె లోడుతో వెళ్తోంది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడి మృతి

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్..?

కోరుట్ల, సెప్టెంబరు 27 : కుటుంబ కలహాలతో ఈనెల 23న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ బొల్లారపు శివప్రసాద్ (35) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో గురువారం రాత్రి మృతి చెందడంతో జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ముందస్తు చర్యల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. కోరుట్ల పట్టణం లోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన బొల్లారం కవితకు 15 ఏళ్ల క్రితం జగిత్యాల జిల్లా మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన శివ ప్రసాద్ (35)తో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొన్ని రోజుల వరకు వారి జీవనం సజావుగా సాగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల నుంచి దంపతుల మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. దీంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఆగస్టు 24వ తేదీన శివప్రసాద్ భార్య ఫిర్యాదు చేసింది. కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో 2వ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్వేత శివ ప్రసాద్‌కు పలు మార్లు కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈ క్రమంలో ఈ నెల 20న ఎస్ఐ శ్వేత శివ ప్రసాద్‌ను కౌన్సెలింగ్ నిర్వహించి అం దరి ముందే చేయి చేసుకోవడంతో అవమాన భారంతో జగిత్యాలలోని తన ఇం టికి వెళ్లాడు. మరో మారు 22న కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉండగా పోలీస్ స్టేషన్ కు వెళ్తే ఎం జరుగుతుందోనని భయపడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం జగిత్యాల ఎరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బంధువులు హైదరాబా దులోని గాంధీ అసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రి నుంచి శివప్రసాద్ సోదరి అతని పరిస్థితిని వివరిస్తూ కోరుట్ల ఎస్ఐ తన అన్నపై చేయి చేసుకు న్నదని అది అవమానంగా భావించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తీసిన వీడియో సామాజిక మాద్యమంలో పోస్టు చేసింది. వీడియో వైరల్ కావడంతో ఎస్ఐ శ్వేత వ్యవహారం భయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. చికిత్స పొందుతున్న శివప్రసాద్ శుక్రవారం ఉదయం మృతి చెందడంతో ఎస్ఐ శ్వేతపై ఎస్పీ అశోక్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసి తన కార్యాలయానికి పిలి పించుకున్నారు. ఎస్సై శ్వేతను వీఆర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. గతంలో కోరుట్ల ఎస్సైగా పని చేసిన కృష్ణకుమార్ ఎఖీన్‌పూర్ గ్రామంలో జరిగిన కేసులో ఆరోపణలు ఎదుర్కొని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ కాగా నెల రోజుల క్రితం ఎస్సైగా పని చేసిన కిరణ్ కుమార్ కూడా ఎస్పీకి ఆటాచ్‌పై వెళ్లాడు. ప్రస్తుతం యువకుడి ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కోంటున్న ఎస్ఐ శ్వేత కూడ ఎస్పీ కార్యాలయానికి ఆటాచ్ కావడం చర్చనీయశంగా మారింది.

పోలీస్ స్టేషన్‌కు బారీ బలగాలు

ఎస్ఐ వేధించాడన్న ఆరోపణలో జగిత్యాల పట్టణానికి చెందిన శివప్రసాద్ మృతి చెందగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి భారీ బలగాలను మొహరించారు. మెట్ పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర రావు పర్యవేక్షణలో కోరుట్ల సీఐ సురేష్ బాబు ఎస్ఐలు శ్రీకాంత్ గౌడ్, నవీన్, శ్యాంరాజు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పర్య వేక్షణ నిర్వహించారు. కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అశోక్ కుమార్ సందర్శించి సంఘటనపై విచారణ చేపట్టారు. కథలాపూర్, మెట్‌పల్లి మండలంలో జరిగిన వివిధ సంఘటనలపై మెట్‌పల్లి డీఎస్పీతో విచారణ జరిపి తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బందోబస్తు మధ్య శివ ప్రసాద్ అంత్యక్రియలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 27 : కుటుంబ కలహాలతో ఈ నెల 23న ఆత్మహ త్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో గురువారం రాత్రి మృతి చెందిన బొల్లారపు శివ ప్రసాద్ (35) అంత్యక్రియలు పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం శివ ప్రసాద్ కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం జగిత్యా లలోని చింత కుంటవాడకు తరలించారు. దీంతో శివ ప్రసాద్ కుటుంబంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో మృతదేహంతో కుటుంబ సభ్యులు ధర్నాకు దిగుతారనే అనుమానంతో జగిత్యాల, కోరుట్ల ప్రాంతానికి చెందిన పోలీసులు మఫ్టీలో శివ ప్రసాద్ ఇంటి వద్దకు చేరుకుని అంత్యక్రియలు పూర్తయ్యే వరకు బందోబస్తు చేపట్టారు. అంతకు ముందే జిల్లాకు చెందిన ఓ పోలీస్ అధికారి శివ ప్రసాద్ కుటుంబ సభ్యులను కలిసి చర్చలు జరిపి కుటుంబానికి న్యాయం చేస్తామనే హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి తల్లి నర్సవ్వ జగిత్యాల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎలాంటి అనుమానాలు లేవని పేర్కొంది.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి, సెప్టెంబరు 27: రుద్రంగిలో శనివారం నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ ప్రకటనలో సూచించారు. రుద్రంగి మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రైవేటు సంస్థల్లో యువతకు అవకాశాలు అందించేందుకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మిడ్ మానేరుకు ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 27: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 12100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు ఆరు గేట్ల ద్వారా 13930 క్యూసెక్కుల నీటిని ఎల్ఎండి ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్ల ప్రస్తుతం 317.57 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 26.45 టీఎంసీల మేర ఉంది.

పొదుపు డబ్బుల లెక్క చెప్పాలి

వీర్నపల్లి, సెప్టెంబర్ 27 : కష్టపడి సంపాదించిన డబ్బులను మహిళ సంఘాలలో పొదుపు పేరిట సభ్యులు జమ చేసిన లెక్కలు చెప్పాలంటూ స్వశక్తి సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో ఐకేపీ ఏపీఎం నర్సయ్య మహిళా సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శివనీల గ్రామైక్య సంఘంలో ఉన్న డబ్బుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 20 సంవత్సరాల నుంచి సంఘంలో పొదుపు చేసిన, ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా వచ్చిన డబ్బుల వివరాలను ప్రతీ సభ్యురాలికి తెలపాలని ఆదేశించారు. ప్రతీ నెల మీటింగ్ ఏర్పాటు చేసి లెక్కలు చెబుతున్నామని సీఏ సమాధానమిచ్చారు. అక్టోబరు 4న గ్రామైక్య సంఘం మీటింగ్ ఏర్పాటు చేసి డబ్బుల వివరాలను తెలుపుతామని ఏపీఎం సభ్యులకు వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు

ఇల్లంతకుంట/ముస్తాబాద్/కోనరావుపేట, సెప్టెంబరు 27: ఇల్లంతకుంట ఎంఈవోగా చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కందికట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను ఇల్లంతకుంట ఎంఈవోగా ప్రభుత్వం నియమించింది. ముస్తాబాద్ ఎంఈవోగా నిమ్మ రాజిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. కోనరావుపేట ఎంఈవో మురళిని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాలాజీ, పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు.

ఎవరిపై పోరాటం చేయాలో చెప్పాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 27:సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమకు సంబంధించిన కార్మికులు ఎవరిపై పోరాటం చేయాలో సిరిసిల్ల ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ చెబితే బాగుండేదని లాల్ బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాపాలను ప్రక్షాళన దిశగా ఆలోచన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పైననా, వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణమైన బీఆర్ఎస్‌పైననా అనేది చెప్పాలన్నారు. లాల్ బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ జన్మదిన వేడుకలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 27: మాజీ ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కేక్‌కట్ చేసి, టపాసులు కాల్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్యయాదవ్ పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 23: సిరిసిల్లలో గార్మెంట్ కంపెనీ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న వారిపై అధికారులతోపాటు కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత లాల్ శుక్లా కార్మిక భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దూరు శివారులోని అపెరల్ పార్కులో గోకుల్‌దాస్ ఇమేజెస్‌ల ఆధ్వర్యంలో గ్రీన్ నీడిల్ కంపెనీలో పనిచేస్తున్న మహిళా కార్మికులపై అధిక పని భారం మోపుతున్నారని, అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కంపెనీలో చాలా రోజులుగా పనిచేస్తున్న కార్మికులను వివిధ కారణాలతో తొలగిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళ చేపడతామని అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, గార్మెంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బత్తుల రమేష్, కార్యదర్శి జిందం కమలాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రేవంత్ మిత్ర మండలి సభ్యులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన రేవంత్ మిత్ర మండలి సభ్యులు విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వర్షాకాలంలో గ్రామ శివారులోని లోలెవల్ కల్వర్ట్‌తో వాగు వస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే సత్యం సానుకూలంగా స్పందించారని విజయ్‌రెడ్డి తెలిపారు.

ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గంభీరావుపేట, సెప్టెంబరు 2: గంభీరావుపేట ఎంపీడీవో రాజేందర్‌పై కలెక్టర్‌కు పిర్యాదు చేసినట్లు కోళ్లమద్ది మాజీ సర్పంచ్ కేశవరావు శుక్రవారం తెలిపారు. అభివృద్ధి పనుల ఒక నెల పెండింగ్ బిల్లులు విడుదలకు ఇటీవల ఎంపీడీవోను కలిసామని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు డబ్బుల ఇవ్వడంలో ఎంపీడీవో జాప్యం చేస్తుండడంతో సీఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల కోసం వెళ్తే ఎంపీడీవో ఉండడం లేదని, ఫోన్ చేస్తే స్పందించడం లేదని, బిల్లులు ఇప్పించాలని సీఈవోకు విన్నవించినట్లు వెల్లడించారు. సీఈవోకు పిర్యాదు చేసిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంపీడీవో పెండింగ్ బిల్లుల డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

గుండెపోటుతో గల్ఫ్‌లో మృతి.. స్వగ్రామానికి మృతదేహం

బోయినపల్లి సెప్టెంబరు 27: బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన బోయినపల్లికి చెందిన దాసరి బాబు గుండెపోటుతో చనిపోగా మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన దాసరి బాబు (45) ఉపాధి కోసం 12 ఏళ్లుగా ఒమన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న గుండెపోటుతో మృతి చెందాడు. బాబు ఎన్ఆర్ఐ పాలసీ కోసం తెలంగాణలో వేయి కిలోమీటర్ల పాదయాత్ర చేసినట్లు గల్ఫ్ కార్మికులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, గల్ఫ్ కార్మికులు కోరారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాళులు అర్పించారు. బాబుకు భార్య భాగ్యమ్మ, కూతుళ్లు అర్చన, ఆకాంక్ష ఉన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

వేములవాడ రూరల్, సెప్టెంబరు 27:వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లికి చెందిన దానె రాజేశం(48) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. రూరల్ ఎస్సై మారుతి వివరాల ప్రకారం.. అచ్చన్నపల్లికి చెందిన రాజేశం కొన్నేళ్లుగా మతిస్థిమితం కోల్పోయి ఇంట్లోనే ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మర్రిపల్లి చెరువులో శుక్రవారం రాజేశం మృతదేహం బయటపడింది.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



వేములవాడలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి

సిరిసిల్ల రూరల్/ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, పద్మశాలి సేవా సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దేవాంతం, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షులు దేవదాస్, సుదర్శన్, కోశాధికారి బాలరాజు పాల్గొన్నారు.

● బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొండాలక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు అన్నల్‌దాస్ వేణు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గౌడ వాసు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: ఆచార్య కొండా లక్ష్మన్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. కొండా లక్ష్మన్ బాపూజీ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ సేవలు చిరస్మరణీయమని, వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై అలుపెరగని పోరాటం చేసి తన జీవితాన్నే అంకితం చేశారన్నారు. బాపూజీ సమాజానికి ఎప్పటికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గూడూరు భరత్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సర్వర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, శీలం స్వామి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మోర రాజు ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, డైరెక్టర్లను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు నిహారిక రెడ్డి, సుద్దాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో..



ఎల్లారెడ్డిపేటలో నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపల్లి ఆనందం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. పద్మశాలి సంఘం నాయకుడు మచ్చ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ సంపత్ రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శరత్ కుమార్, న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

చందుర్తి : చందుర్తిలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నటరాజన్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఏపీవో రాజయ్య, మాజీఎంపీపీ పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులను మోసం చేసిన కేసీఆర్, కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గతంలో కేసీఆర్, కేటీఆర్ గల్ఫ్ కార్మికులను వాడుకున్నారని, గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ. 500 కోట్లు కేటాయిస్తామని, మరణిస్తే రూ.5 లక్షల పరిహారం ఇస్తామని చెప్పి మోసం చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు లెక్కల ప్రకారం 2 వేలకు పైగా పార్థివదేహాలు వస్తే గత పాలకులు ఒక్క కుటుంబానికి కూడా పైసా ఇవ్వలేదన్నారు. తాము ఇచ్చిన మాట ప్రకారం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే వేములవాడ నియోజకవర్గానికి చెందిన గల్ఫ్‌లో మృతిచెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేశామన్నారు. రాజన్న ఆలయానికి కేసీఆర్ ఏటా రూ .100 కోట్లు ఇస్తానన్నారని, ముంపు గ్రామాల ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మోసం చేశారని అన్నారు. కొదురుపాకలో కేటీఆర్ ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా మనుమడిగా వచ్చానని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ముంపు గ్రామం కొదురుపాకలో చిన్నప్పుడు ఆడుకున్న కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు గ్రామస్థులు పడుతున్న బాధలను ఎందుకు తీర్చలేదని, కేసీఆర్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గల్ఫ్‌లో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఇస్తే మళ్లీ రేవంత్‌రెడ్డి హయాంలో ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటుందని, హైదరాబాద్‌లో జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' ప్రత్యేక కౌంటర్‌ను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారని అన్నారు. గల్ఫ్‌లో ఏ కారణం చేత మరణించినా బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు చెప్పారు. గల్ఫ్‌కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సలహా మండలి ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, కూస రవీందర్, కత్తెర దేవదాస్, ఆడెపు ప్రభాకర్, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణం లక్ష్మీంకటేశ్వర దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం పక్కన మున్సిపల్ ఆధ్వర్యంలో టాయిలెట్ల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి శుక్రవారం భూమి పూజ చేశారు.

సిరిసిల్ల కలెక్టరేట్: ప్రపంచ రేబీస్ నివారణ దినం సందర్భంగా జిల్లాలోని పలు పశువైద్యశాలల పరిధిలో ప్రజలతో పాటు జంతువుల యాజమానులకు శనివారం రేబీస్ వ్యాధిపై అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

సిరిసిల్ల రూరల్: విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారంచాలంటూ ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ మహాగర్జనకు శుక్రవారం సిరిసిల్ల నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు తరలివెళ్లారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలం సుద్దాలలో బీఆర్ఎస్ కార్యకర్త రామోజీ విష్ణు మృతి చెందగా ఆ కుటుంబాన్ని పార్టీ నేత ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలానికి చెందిన బానోతు నరేష్ లంబాడీ ఐక్యవేదిక స్టేట్ ఇన్‌చార్జిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ తెలిపారు.

చందుర్తి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కరీంనగర్ పద్మపాణి సొసైటీ నిర్వాహకుడు సంజీవ్ శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

చందుర్తి : చందుర్తి మండలం మర్రిగడ్డ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గడప రఘుపతిరావు సేకరించిన చారిత్రక ప్రదేశాల చిత్రాల ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం ఎంఈవో వినయ్ కుమార్ ప్రారంభించారు.

రుద్రంగి: హాఫ్ మారాథాన్‌లో భాగంగా రుద్రంగి మండలంలోని బడితండాలో అక్టోబరు 10న 100 మీటర్లు, 800 మీటర్లు, 3కె రన్, 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ముస్తాబాద్: మండలంలోని బందనకల్ ప్రాథమిక పాఠశాలకు ప్రముఖ సింగర్ సుమన్ టీవీని వితరణ చేయగా ముస్తాబాద్ ఎస్సై సీహెచ్ గణేశ్ అందజేశారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం లింగన్నపేట అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా సుద్దాల భూమయ్య, ఉపాధ్యక్షుడిగా తంగళపల్లి ప్రభాకర్ తదితరులు ఎన్నికయ్యారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ఆవరణలో శనివారం సహకార సంఘం మహాజన సభ ఉంటుందని ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.50 వేల విలువైన కంప్యూటర్‌ను వితరణ చేశారు.

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్లకు చెందిన ఎరవెల్లి శంకర్ కుటుంబానికి స్నేహితులు రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. శంకర్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు.

ఏఎంసీ పాలకవర్గాలకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 27: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు నారాయణపూర్‌లో శుక్రవారం వీర్నపల్లి ఏఎంసీ పాలక వర్గం సభ్యులను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ రాములునాయక్, డైరెక్టర్లు మంజుల కాంతయ్య, నర్సింగం, రాచర్లబొప్పాపూర్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులను మండల గిరిజన నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బంజారా సంఘం నాయకులు గజన్ లాల్ నాయక్, ప్రకాష్ నాయక్, తులసి రామ్‌నాయక్, శ్రీరామ్ నాయక్, రాజునాయక్ ఉన్నారు.

మండలంలో నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లంకెల లక్ష్మణ్‌తోపాటు సభ్యులను మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

వేములవాడలో పోషణ్ అభియాన్

వేములవాడ, సెప్టెంబర్ 27: పోషణ్ అభియాన్ కార్యక్రమం శుక్రవారం వేములవాడలో నిర్వహించారు. జిల్లా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక కట్ట రాజయ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ సాహసోపేత నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 27 : ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి దేశ చరిత్రలో సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సహకార సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తోందన్నారు. సహకార సంఘాలు వాణిజ్య బ్యాంకులకు దీటుగా రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పంటలను రైతులు సగర్వంగా అమ్ముకునేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించారని గుర్తు చేశారు. మన ప్రాంతంలో ఆనాడు రూ. 1737 కోట్లతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భూమి పూజ చేశారన్నారు. 27 రోజుల్లోనే దాదాపు 22.37 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ. 18 వేల కోట్ల రుణ మాఫీ నిధులు జమ చేయడం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ అర్హులైన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసమే సహకార సంఘాలు ఏర్పడ్డాయని వాటి బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు ముందుకు దూసుకుపోతున్నాయన్నారు. రైతులకు సకాలంలో పంట, వ్యాపార రుణాలు అందిస్తూ ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆర్డీవో, సింగిల్ విండో వైస్ చైర్మన్ తూమ్ కాంతారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, సీఈవో మిట్ట లక్ష్మణ్, డైరెక్టర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించేంత పెద్దోడివి కాలేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 27 : 'అయ్యో పాపం శ్రీనన్న' అని ప్రజలు గెలిపించుకున్నారని, వేములవాడ అభివృద్ధి చూసుకోవాలని, కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించేంత పెద్దోడివి కాలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. శుక్రవారం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విప్‌గా జిల్లాకు న్యాయం చేయాలని, ప్రజల బాగోగులను చూసు కోవాలని సూచించారు. కల్లోల జిల్లాను అభివృద్ధి పథంపై కేటీఆర్ పరుగులు తీయించారన్నారు. ప్రాజెక్టులు, రోడ్లు, సబ్ స్టేషన్లు, విద్యుత్ ప్రాజెక్టులు కేసీఆర్ కట్టించారన్నారు. 420 గ్యారెంటీలు అంటూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. రాజన్న సాక్షిగా నిబద్ధతతో పని చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి మెప్పు కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించే స్థాయి మీకు లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 420 గ్యారెంటీలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో ముఖ్య మంత్రులు మారుతారని, వేములవాడ అభివృద్ధిని చూసుకోవాలని అన్నారు. రాజన్న సాక్షిగా ఇచ్చిన హామీలను నియోజకవర్గంలో నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించారన్నారు. ప్రతి పక్ష పార్టీ నాయకులుగా ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందుకు తీసుకొస్తామన్నారు. తాము ప్రెస్ మీట్ పెట్టిన ప్రతీసారి మీరు, శని, ఆదివారాలు వచ్చే కేకే మహేందర్‌రెడ్డి మీటింగ్‌లు పెట్టి తమపై కౌంటర్ ఇవ్వడం మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ శంకరయ్య, మాజీ కౌన్సిలర్ పూర్ణచందర్, రాఘవరెడ్డి, మల్లారెడ్డి, రవిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు సీఎంను విమర్శించే అర్హత లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 27 : కేటీఆర్ పరాన్నజీవి అని, సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం పేరిట కేసీఆర్ బిడ్డవు కాబట్టి ఆ నాడు టికెట్టు వచ్చిందన్నారు. పది నెలల కాలంలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పట్టుమని పదిసార్లు కూడా రాలేదని, ఇక్కడి ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి అక్రమాల పాలన తీరుకు నిరసనగా ప్రజలు రాష్ట్రంలో ఆ పార్టీని బండకేసి కొట్టిన బుద్ధి రాలేదన్నారు. అహంకార పూరితంగా అవాకులు చెవాకులు మాటలను మరవలేదన్నారు. కింది స్థాయి నుండి వచ్చిన రేవంత్‌రెడ్డిపై మీ పాలనలో అక్రమ కేసులు పెట్టినా భరించారన్నారు. గతంలో సిరిసిల ట్రస్టు ఏర్పాటు చేసి ఇచ్చిన రూ.50 లక్షల్లో కేసీఆర్‌ది పైసా కూడా ఇవ్వలేదన్నారు. ఉద్యమ సమయంలో దాతలు ఇచ్చిన డబ్బులేనన్నారు. సిరిసిల్లకు రూ.3312 కోట్లు ఇచ్చామని కేటీఆర్ చెపుతున్నారని ఇక్కడ 10 వేల మంది కార్మికులకు ఒక్కో కార్మికుడికి రూ.33 లక్షలు రావాలన్నారు. ఎవరికిచ్చారు? ఎవరు బాగుపడ్డారని ప్రశ్నించారు. బతుకమ్మ చీరల పేరిట కార్మికులను ఆగం చేసిండని ఆరోపించారు. సిరిసిల్ల పద్మశాలీలకు తాము అండగా ఉన్నామన్నారు. ఓట్ల రాజకీయం కోసం రూ.300 కోట్లు బకాయిలు పెడితే తాము దాదాపు 85 శాతం డబ్బులు ఇచ్చామని, యారన్ సబ్సిడీవిడదల చేశామని, 211 మందికి నేతన్నకు చేయూత హాండ్లూమ్ త్రిఫ్టు కాటన్ సెక్టార్‌లో రూ.57.03 లక్షలు, నేతన్న పవర్ సెక్టార్‌లో 5720 మందికి రూ.264.62లక్షలు, బీమా రూ.5450 మందికి ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ పాలనలో దాదాపు 97 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు కోటి 30 లక్షలు తప్పకుండా ఇస్తామన్నారు. రేషన్ డీలర్ల దుకాణాలను మహిళా సంఘాలకు కేటీఆర్ ఇచ్చారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, కౌన్సిలర్ కుడికాల రవికుమార్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, జగన్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు శివప్రసాద్, గౌతమ్ పాల్గొన్నారు.

పద్మశాలీలకు మొదటి నుంచి కాంగ్రెస్ సేవలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 27 : కాంగ్రెస్ పద్మశాలి సమాజానికి మొదటి నుంచి సేవలందిస్తోందని ఆ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ సర్కస్ వాళ్లు వచ్చినట్లు అప్పుడప్పుడు సిరిసిల్లకు వస్తున్నారని, అనవసర వ్యాఖ్యలు చేస్తూ వెళ్తున్నారని విమర్శించారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరలతో ఆ పది మంది వ్యాపారులను బతికించిన ఘనత కేటీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై అనవసరమైన ఆరోపణలు చేస్తే ఊరుకోబోమన్నారు. గతంలో వైఎస్ఆర్ నేతకార్మికులను ఆదుకున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక వస్త్ర పరిశ్రమను నాశనం చేసిందని అన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వస్త్ర పరిశ్రమ కోసం ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ కుడికాల రవికుమార్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు దుబాల వెంకటేశం, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అభాండాలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు స్వరూపతిరుపతిరెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 27 : సిరిసిల్ల నియోజవకర్గం పరిధిలోని రేషన్ డీలర్ల నియామకం పారదర్శకంగా నిర్వహిస్తే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం, కేకే మహేందర్‌రెడ్డిపై అభాండాలు వేస్తున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ మహిళా అధ్యక్షురాలు వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలో 58 రేషన్ దుకాణాల డీలర్ల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వేశామని, 830మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. నియామకాలు పారదర్శకంగా చేపట్టేందుకు అధికారులు అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారని, అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వచ్చిన మొత్తం మార్కులతో రిజర్వేషన్ల వారిగా ఎంపిక చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రేషన్ డీలర్ల ఖాళీలు చెప్పలేదన్నారు. నోటిఫికేషన్ వేయకుండనే వారికి సంబంధించిన వారికి కేటాయించారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆడెపు చంద్రకళ, సుధా, రోజా, ఎండీ అప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ధరల భారం తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

వేములవాడ, సెప్టెంబరు 27 : ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరల కారణంగా ప్రజలపై మోయలేని భారం పడుతున్నదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని నిత్యావసర సరుకుల ధరలు తగ్గించేందుకు ప్రయత్నించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు కోరారు. ధరల పెరుగుదలను నిరసిస్తూ శుక్రవారం వేములవాడ పట్టణంలోని మూలవాగు వంతనపై సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ పేరుతో విచ్చలవిడిగా రేట్లను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. దీంతో ఉల్లిగడ్డ, ఉప్పు, పప్పు, నూనె ధరలు మండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి వెంటనే నియంత్రించాలని డిమాండ్ చేశారు. సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ సీపీఐ కార్యదర్శి శ్రీరాములు, నర్సయ్య, క్రాంతి, నామాల శ్రీనివాస్, రాములు, మల్లయ్య తదితరులు ఉన్నారు.